# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 31-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 134వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ఆకాశవాణి, దూరదర్శన్లలో ప్రసారమౌతుంది.**

2. **రాష్ట్ర స్థాయి యోగాంధ్ర కార్యక్రమం జూన్ 21న అమరావతిలో 25 వేల మందితో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **తెలంగాణలో ధాన్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం సుమారు 26 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు.**

4. **ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించేందుకు 2 వేల 728 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసినట్టు ఆంధ్రప్రదేశ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 134వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

రాష్ట్ర స్థాయి యోగాంధ్ర కార్యక్రమం వచ్చె నెల 21న అమరావతిలో 25 వేల మందితో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో వెయ్యి మందితో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమం జరపాలన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో యోగాంధ్రపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కోటి మంది ఈ కార్యక్రమంలో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 7 నుంచి 21 వరకు 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగాంధ్ర నిర్వహణ కోసం ప్రతి జిల్లాకు 25 లక్షల రూపాయల చొప్పున నిధులు కేటాయించినట్లు పేర్కొనారు. ఈ సందర్భంగా యోగా, నాచురోపతి

విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించిన యోగాంధ్ర పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

---------------------------

తెలంగాణలో ధాన్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం సుమారు 26 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాదులో బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పాత్రికేయులతో కేంద్ర మంత్రి నిన్న మాట్లాడుతూ.. ప్రజా పంపిణీ వ్యవస్థ మొత్తం వ్యయంలో 72.67 శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తోందన్నారు. రబీ సీజన్‌లో రైతులకు బోనస్ ఎందుకు ఇవ్వలేదో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. డీజిల్ కొరత ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

---------------------------

మెగా డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా రేపు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్సీపీ నాయకులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టామన్నారు. అక్రమాలపై తాము లేవనెత్తిన కీలక ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. డీఎస్సీ కుంభకోణంపై ప్రభుత్వం సిబిఐ దర్యాప్తుకు ఆదేశించే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు.

---------------------------

మెగా డీఎస్సీ-2025 నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు, అక్రమాలు జరగలేదని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కార్యాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2025 డీఎస్సీని అత్యంత పారదర్శకంగా నిర్వహించామన్నారు. దీని కోసం 3లక్షల 36 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని ఆయన పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జూన్ నెలలో 62 లక్షల 34 వేల 445 మంది పెన్షన్ దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల అందించేందుకు 2 వేల 728 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసినట్టు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా 5 వేల 606 స్పౌజ్ పెన్షన్లు మంజూరు చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. రేపు ఉదయం నుంచే సచివాలయ ఉద్యోగులు ఈ పెన్షన్లు లబ్ధిదారులకు నేరుగా పంపిణీ చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం రికార్డు స్థాయిలో 65 వేల 886 కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు వెల్లడించారు.

---------------------------

గత 12 సంవత్సరాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రజాహిత పరిపాలన అందిస్తూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోంది. రైతుల సంక్షేమం

కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్  భీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్ వంటివి రైతులకు ఆర్థికంగా ఆదుకుంటున్నాయని పథకం కింద లబ్దిపొందిన రాజశేఖర్ రెడ్డి వివరిస్తూ..

వాయిస్..25 సెకన్లు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముద్ర రుణం చిరు వ్యాపారాలు నిర్వహించే మహిళలకు ఆర్థిక భరోసాను ఇస్తుందని లబ్ధిదారు మస్తాన్ బి వెల్లడిస్తూ..

వాయిస్..25 సెకన్లు

---------------------------

పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల్లోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ లతో కలసి ఆయన నిన్న శంకుస్థాపన చేశారు.

---------------------------

కొన్ని చోట్ల ఎండ తీవ్రత, మరి కొన్నిచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు ప్రభావంతో రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈరోజు ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గి, కొన్నిప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. దక్షిణ ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈ రోజు అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, మిగతా జిల్లాల్లోనూ చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

మరోవైపు తెలంగాణలో రానున్న 4 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం తెలిపింది.

======================